
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5
శ్రీ సత్యసాయి
బుధవారం 18 మార్చి 2026

# ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ అవగాహన సదస్సు

- ధర్మవరం చేనేత కార్మికుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది.
- ధర్మవరం చేనేతకు కొత్త దిశ -- మెగా క్లస్టర్‌తో మంత్రి సత్య కుమార్ యాదవ్ సరికొత్త చరిత్ర!
- చేనేతకు చైతన్యం -- సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో మెగా క్లస్టర్ దిశగా ధర్మవరం
- వైసీపీ కాలానికి చెక్ -- కూటమి పాలనలో చేనేతకు బంగారు భవిష్యత్తు
- చేనేత అంటే ధర్మవరం... ధర్మవరం అంటే చేనేత -- మంత్రి సత్య కుమార్ యాదవ్.
- చేనేత కార్మికుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం -- సత్య కుమార్ యాదవ్
- ధర్మవరం పట్టు చీరకు గ్లోబల్ గుర్తింపు లక్ష్యం -- మంత్రి సవిత స్పష్టం
- 8 నెలల్లో ధర్మవరం మెగా క్లస్టర్ ప్రారంభిస్తాం -- మంత్రి సవిత
- ధర్మవరంలో ఆప్కో షో రూమ్ ఏర్పాటు చేస్తాం -- మంత్రి సవిత



ధర్మవరం, మార్చి 17 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌పై మంగళవారం చేనేత కార్మికుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మరియు ధర్మవరం శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్ గారు, రాష్ట్ర జౌళి శాఖ మంత్రి సవిత గారు, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ గారు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి గారు, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు, టెక్స్టైల్ కమిషనర్ రేఖా రాణి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ,.... తాను ధర్మవరం కూటమి అభ్యర్థిగా వచ్చిన ప్రారంభ దశలో చేనేత రంగంపై పరిమిత అవగాహన ఉన్నప్పటికీ, స్థానిక నాయకులు పరిటాల శ్రీరామ్ గారు, మధుసూదన్ రెడ్డి గారు ఈ రంగంలోని సమస్యలను వివరించారు. చేనేత కార్మికుల సమస్యలు తనను ఈ రంగంపై లోతుగా అధ్యయనం చేయడానికి ప్రేరేపించాయని తెలిపారు. ధర్మవరం అంటే చేనేత, చేనేత అంటే ధర్మవరం" అనే స్థాయికి ఈ ప్రాంతం ఎదిగిందని, అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ధర్మవరం పట్టు చీరలు మన పూర్వీకుల గొప్ప వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు హ్యాండ్లూమ్ మెగా క్లస్టర్‌ను ధర్మవరానికి తీసుకురావడం తనకు ఒక బాధ్యతగా భావించి, కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో, సహకారంతో ఈ ప్రాజెక్టును సాధించడం ఒక కీలక విజయమని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం స్థలం సేకరణలో ఎదురైన సవాళ్లను వివరించి, అనేక ప్రాంతాలు పరిశీలించిన తరువాత మార్కెట్ యార్డ్ స్థలాన్ని ఎంపిక చేసి, ముఖ్యమంత్రి గారు మరియు సంబంధిత మంత్రులు, అధికారుల సహకారంతో ఈ ప్రక్రియను విజయవంతం చేశాం అని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ గారికి, రాష్ట్ర జౌళి శాఖ మంత్రి సవిత గారికి, టెక్స్టైల్ కమిషనర్ రేఖారాణి గారికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుమారు ₹40 కోట్ల కేంద్ర నిధులతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును మాస్టర్ వీవర్స్ భాగస్వామ్యంతో ₹100 కోట్ల స్థాయికి విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మెగా క్లస్టర్ ద్వారా ఆధునిక టెక్నాలజీ, డిజైనింగ్ సదుపాయాలు, జాక్వార్డ్ వ్యవస్థలు, అలాగే పర్యావరణానికి అనుకూలంగా వతీశీ ాఆఒనబఆఒ ఙఆంఎష్ఘుతీస్త్రవ విధానంతో ఆధునిక డైయింగ్ యూనిట్ వంటి అన్ని సౌకర్యాలను ఒకే చోట అందించనున్నామని వివరించారు. దీని ద్వారా నేయర్ల ఉత్పాదకత పెరగడంతో పాటు వారి ఆదాయం 25--30 శాతం వరకు పెరుగుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ధర్మవరం చీరలు ఇతర ప్రాంతాల పేరుతో మార్కెట్లోకి వెళ్లిన పరిస్థితిని మార్చి, ధర్మవరం సిల్క్ అనే బ్రాండ్‌ను బలోపేతం చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడం తమ లక్ష్యమని మంత్రి గారు పేర్కొన్నారు. ధర్మవరం చేనేతకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న గుర్తింపును ప్రస్తావిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ గారు సహా పలువురు ప్రముఖులు ధర్మవరం పట్టు చీరలను ప్రశంసించారని తెలిపారు. అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠలో ధర్మవరం పట్టు వినియోగం, తిరుమల శ్రీవారి సాలువాల ఆర్డర్లు స్థానిక నేతన్నలకు రావడం ఈ ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. అదేవిధంగా ధర్మవరం నాగరాజ్ వంటి నేతన్నల ప్రతిభ దేశవ్యాప్తంగా చేనేత రంగానికి మరింత గౌరవాన్ని తీసుకువస్తోందని కొనియాడారు. ఇక ధర్మవరం సమగ్ర అభివృద్ధిలో భాగంగా ₹70 కోట్ల వ్యయంతో రేగాటిపల్లె సమీపంలో ఆయుర్వేద మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ కేవలం ఒక ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా ధర్మవరం ఆర్థికాభివృద్ధికి, చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే మహత్తర ఉద్యమమని ఆయన స్పష్టం చేశారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసి నేతన్నల జీవనోపాధిని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై సూచనలు అందించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు పిలుపునిచ్చారు.

ఇదే సందర్భంగా రాష్ట్ర జౌళి శాఖ మంత్రి సవిత గారు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నేతన్నల ఆరోగ్య రక్షణకు యూనివర్సల్ హెల్త్ పాలసీలో ప్రాధాన్యతనివ్వనున్నట్లు పేర్కొంటూ, త్వరలోనే "నేతన్న భరోసా" పథకం కింద చేనేతలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నామని వెల్లడించారు. ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను సుమారు ₹38 కోట్లకు పైగా నిధులతో ఏర్పాటు చేసి, ఎనిమిది నెలల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్లస్టర్ ఏర్పాటుతో సుమారు 8 వేల మంది మహిళలకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ సాధనలో మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి పాత్ర కీలకమని ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఏప్రిల్ 1వ తేదీ నుండి చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందజేయనున్నట్లు ప్రకటిస్తూ, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనివల్ల వారికి సంవత్సరానికి గణనీయమైన ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు అందిస్తున్నామని, థ్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేయడంతో పాటు చేనేత సహకార సంఘాల బకాయిలను కూడా చెల్లిస్తున్నామని వెల్లడించారు. చేనేత ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, బజార్లు నిర్వహిస్తున్నామని, 90 శాతం సబ్సిడీపై స్టాండ్ లూమ్స్ అందజేస్తున్నామని తెలిపారు. ధర్మవరంలో చేనేత ఉత్పత్తుల ప్రోత్సాహం కోసం ాఆజూ షోరూమ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ముగింపుగా, ఈ మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ధర్మవరం చేనేత రంగానికి కొత్త దిశను చూపించడంతో పాటు నేయర్ల జీవనోపాధిని మెరుగుపరచే కీలక అడుగుగా నిలుస్తుందని, ప్రభుత్వం చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్స్టైల్ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జౌళి శాఖ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## శింగనమల వైఎస్సార్సీపీలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముగ్గురు సీనియర్ నేతల అడుగులు

అనంతపురం, మార్చి 17 (అనంత ప్రభ)

శింగనమల నియోజకవర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త మాజీ మంత్రి సాకే శైలజనాథ్ గెలుపు కోసం శ్రమిస్తున్న నాయకులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కీలక నియోజకవర్గాల్లో ఒకటైన శింగనమలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు ఉంది. నార్పల సత్యనారాయణ రెడ్డి, తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, మరియు గార్లదిన్నె నారాయణరెడ్డి వంటి సీనియర్ నాయకులు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలం నుండి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వీరు, ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

నేతల ప్రస్థానం -

నార్పల సత్యనారాయణ రెడ్డి: నార్పల మండలంలో ఈయనకు తిరుగులేని పట్టు ఉంది. స్థానిక సమస్యల పరిష్కారంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు.

తరిమెల వంశీ గోకుల్ రెడ్డి: రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చిన వంశీ గోకుల్ రెడ్డి, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో విజయం సాధించారు. నియోజకవర్గ స్థాయి రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, క్లిష్ట సమయాల్లో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు.



గార్లదిన్నె నారాయణ రెడ్డి: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నారాయణ రెడ్డి, గార్లదిన్నె మండల పరిధిలో పార్టీ వ్యూహకర్తగా గుర్తింపు పొందారు. సీనియర్ నాయకుడిగా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

ఐక్యతే బలం.. విజయమే లక్ష్యం!

ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, ఈ ముగ్గురు నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లడం పార్టీకి ఎంతో అవసరమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్న తమ అనుచర వర్గాలను ఏకం చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వీరు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. రానున్న రోజుల్లో శైలజనాథ్ ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం తపన శింగనమల రాజకీయాల్లో ఈ ముగ్గురు సీనియర్ల పాత్ర మరింత కీలకం కానుంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో కూడా ఈ నేతలు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, రాబోయే సవాళ్లకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు.

## ముగిసిన కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ పాలనా పర్వం: వీడ్కోలు సభలో...

కళ్యాణదుర్గం, మార్చి 17 (అనంత ప్రభ)

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ నేటితో మున్సిపల్ చైర్మన్ పదవీ కాలం పూర్తి కావస్తున్న తరుణంలో, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ శ్రీమతి తలారి గౌతమి సోమశేఖర్ గారికి ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, చైర్మన్ గారిని దుశ్శాలువతో కప్పి, పూలమాలలు వేసి మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అధికారులు - ప్రజల మధ్య వారధిగా..

రేపటి నుండి మున్సిపాలిటీలో అధికారుల పాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో, చైర్మన్ తన పదవీ కాలంలో చేసిన సేవలను అందరూ గుర్తు చేసుకున్నారు. అతి తక్కువ కాలంలోనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారి అశీసులతో పట్టణ అభివృద్ధికి ఆమె చూపిన చొరవ, ముఖ్యంగా ప్రజలకు మరియు అధికారులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, ఒకే కుటుంబ సభ్యుల్లా పని చేయడం పట్ల హర్షం వ్యక్తమైందని చైర్మన్ ఆనందం వ్యక్తం చేసారు.

సన్మాన గ్రహీత, మున్సిపల్ చైర్మన్ శ్రీమతి గౌతమి సోమశేఖర్ గారు మాట్లాడుతూ...

" పదవి అనేది బాధ్యత మాత్రమే, కానీ ప్రజల గుండెల్లో




సంపాదించుకున్న ప్రేమ శాశ్వతమైనది . అధికారులు, సిబ్బంది మరియు ప్రజల సహకారంతో ఈ కొద్ది కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేయగలిగాం. ప్రజలతో నాకున్న ఈ అనుబంధం ఎప్పటికీ మరువలేనిది. నా పాలన ముగిసినా, మీ అందరి కష్టసుఖాల్లో తోడుగా ఉండే సామాన్య వ్యక్తిగా ఎప్పుడూ అందుబాటులో ఉంటాను."

## మాతృ మరణాలు శిశు మరణాలు పై సమీక్ష సమావేశం

అనంతపురం, మార్చి 17 (అనంత ప్రభ)

ఈరోజు అనంతపురంలో డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో డాక్టర్ ఈ బి దేవి అధ్యక్షతన జిల్లాలో జరిగిన మాతృ మరణాలు శిశు మరణాలు పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది.

ఇందులో , 6 శిశు మరణాలు పై సమీక్ష నిర్వహించడం జరిగింది. గ్రామస్థాయిలో పనిచేసినటువంటి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ముఖ్యంగా మాత శిశు సేవలపై శ్రద్ధ వహించి భవిష్యత్తులో జిల్లాలో ఎలాంటి మాత శిశు మరణములు జరగకుండా చూడాలని చెప్పడం జరిగినది. ముఖ్యముగా గర్భవతులకు మరియు బాలింతలకు ప్రభుత్వము నుంచి ఇచ్చు సేవలు పకడ్బందీగా నిర్వహించాలని గ్రామస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటిలో ఉన్న గర్భవతులు గాని బాలింతలు గాని చిన్న పిల్లలకు తగిన పరీక్షలు నిర్వహించి ప్రమాదకరమైన లక్షణములు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యాధికారి వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి మందులు ఇప్పించి వాటిని క్రమం తప్పకుండా వాడేలా చూడాలని చెప్పడం జరిగింది. గ్రామస్థాయిలో ముఖ్యముగా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం చేపట్టినప్పుడు పిల్లలు వారి వయస్సు తగ్గ బరువు ఉన్నదా లేదా అని బరువులు చూడాలని మరియు వారి ఎత్తుకు తగ్గ బరువు కొలతలను ఎం సి హెచ్ కార్డు నందు నమోదు చేయాలని సూచించడం జరిగింది మరియు గర్భవతులు



బాలింతలు మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన అంగనవాడి కేంద్రం నుండి పోషకాహారము తీసుకోవాలని అలాగే కాన్పు అయిన తర్వాత 180 రోజులు ఐరన్ మరియు క్యాల్షియం మాత్రలు వాడాలని చెప్పడం జరిగినది ప్రతి నెల 9వ తేదీ మరియు 10వ తేదీ పిఎంఎస్ఎంఏ ప్రోగ్రామ్ నందు కచ్చితంగా పీహెచ్ స్థాయిలో ఉన్న గర్భిణులకు వైద్య అధికారులకు తప్పక పరీక్ష చేయాలని మరియు అవసరమైన వారికి టిఫ స్కానింగ్ కు రిఫర్ చేయాలని దీని ద్వారా జన్యుపరమైన లోపములో గల పుట్టే పిల్లలను నివారించవచ్చునని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ శశి భూషణ్ రెడ్డి డి ఐ ఓ, డాక్టర్ దేవిడ్ సెల్వరాజ్ డిసిహెచ్ ఎస్ డాక్టర్ సోమశేఖర్ , మత్తుమందు వైద్యులు, డాక్టర్ దినకర్, చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి డిపిఎమ్ఓ, డాక్టర్ బి విష్ణుమూర్తి ఎన్ సి డి పి ఓ, పి ప్రమీల దేవి, హేమలత పాల్గొన్నారు

## కీటక జనిత వ్యాధులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం

అనంతపురం, మార్చి 17 (అనంత ప్రభ)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న మగ ఆరోగ్య కార్యకర్తలుకు కీటక జనిత వ్యాధులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జిల్లా మలేరియా అధికారి శ్రీ ఓబులు గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది.

ఈ శిక్షణా కార్యక్రమంలో కీటకాల ద్వారా వ్యాపించు మలేరియా, డెంగు, చికెన్ గున్యా, మెదడువాపు, ఫైలేరియా, కాలా అజార్ వంటి జబ్బులు పై ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలియజేశారు. అనంతపురం జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది పురుషులు జాతీయ కీటకజనత రోగ నియంత్రణ కార్యక్రమంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు పనిచేస్తూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని దోమల ద్వారా మలేరియా డెంగ్యూ లాంటి జబ్బులు రాకుండా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వ్యాధులు పట్ల అవగాహన నివారణ చర్యలు గురించి, రక్త పరీక్షలు గురించి



తెలియజేయాలని మలేరియా, డెంగీ వ్యాధులు వల్ల వేలాది రూపాయలు పేద ప్రజల ఖర్చుపెట్టకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు చేపట్టాలని ఓబులు వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని లేనియెడల తాము ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు అబ్దుల్, మునాఫ్, మద్దయ్య,బత్తుల కోదండరాంరెడ్డి నాగేంద్రప్రసాద్ ఎస్ ప్రభాకర్ రామకృష్ణ మరియు హెల్త్ సూప=ర్వైజర్లు శ్రీధర్ నూర్ భాషా లోకేశ్వర్ రెడ్డి రమేష్ తదితరులు ఆరోగ్య కార్యకర్తలు కు పలు సూచనలు,శిక్షణ ఇచ్చారు

## యాడికి విద్యార్థినికి కీర్తనకు అరుదైన గౌరవం




యాడికి ,మార్చి 17 (అనంత ప్రభ)

యాడికికి చెందిన విద్యార్థిని గంగవరము రాజ సాయిమణి కీర్తన అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. రవీంద్ర ఉమెన్స్ ఇంజనీరింగ్ క్యాంపస్ తరపున జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌కు ఆమె ఎంపిక కావడం విశేషం. ఈ ఫెస్టివల్ నాగాలాండ్ రాష్ట్ర రాజధాని తిమ్మాపూర్‌లో నిర్వహించబడనుంది. భారత ప్రభుత్వ ప్రతినిధులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన నలుగురు విద్యార్థుల్లో కీర్తన ఒకరుగా నిలవడం గర్వకారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా గుడ్ ఇంప్రెషన్ స్పీచ్ విభాగంలో మంచి వ్యాఖ్యాతగా ఎంపిక కావడం ఆమె ప్రతిభకు నిదర్శనమని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా కీర్తన తండ్రి గంగవరం శ్రీధర్ మాట్లాడుతూ తమ కుమార్తెకు ఈ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ యూత్ ఫెస్టివల్ కు సంబంధించిన రాను పోను ఖర్చులు వసతి ఏర్పాట్లు అన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. కీర్తన సాధించిన

## ప్రథమ చికిత్స కేంద్రాలను పరిశీలించిన వైద్యాధికారి




యాడికి, మార్చి 17(అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను రాయలచెరువు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దేవరాజన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ఆర్ఎంపీ డాక్టర్లు రోగులకు సమయానికి ప్రథమ చికిత్స మాత్రమే అందేలా చూడాలని సూచించారు. అర్హతకు మించి వైద్యం చేయకూడదని తెలిపారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు

## ఉగాది ఉత్సవాల నిర్వహణకు ఏఎస్పీని కలిసిన రుద్రమ నాయుడు



యాడికి, మార్చి 17 (అనంత ప్రభ)

యాడికి మండలం పెద్దపేట గ్రామంలోని శ్రీ సంజీవరాయ స్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించనున్న ఉత్సవాలు మరియు రాతిదూలం ఏర్పాటు కోసం తాడపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిని యాడికి టీడీపీ మాజీ మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతి ఏడాది నిర్వహించే ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు

## వైద్యాధికారులు మొబైల్ ఆర్ఎంపీల వైద్యం వైపు చూడరా?

యాడికి, మార్చి 17 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలో కొందరు మొబైల్ ఆర్ఎంపీ డాక్టర్లు హద్దులు మీరుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితమవ్వాల్సిన వీరు, అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, వైద్య పట్టాలు పొందిన డాక్టర్లకు సమానంగా చికిత్సలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చిన్నచిన్న వ్యాధులకే అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ వినియోగించడం, అవసరం లేకున్నా ఇంజక్షన్లు ఇవ్వడం, సెలైన్ బాటిళ్లు ఎక్కించడం వంటి చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు మొబైల్ ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో రోగుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు స్పందించి, మొబైల్ ఆర్ఎంపీల అర్హతకు తగ్గట్టుగా మాత్రమే వైద్యం చేయించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మండలంలోని మొబైల్ ఆర్ఎంపీల వైద్య సేవలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## రథోత్సవం అనుమతుల కోసం వినతి




యాడికి, మార్చి 17 (అనంత ప్రభ )

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా స్వామివారికి ఉత్సవాలు, రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని యాడికి మండల తహసిల్దార్ ప్రతాప్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే రథోత్సవం సందర్భంగా విద్యుత్ సంబంధిత భద్రతా చర్యలు చేపట్టాలని యాడికి మండల విద్యుత్ శాఖ ఏఈ విజయుడిని కలిసి ప్రత్యేకంగా కోరారు. రథోత్సవం రోజున ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌తో పాటు టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఘన విజయం



ఆదోని, మార్చి 17 (అనంత ప్రభ)

గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహిస్తున్న “అన్నదాత సుఖీభవ” కార్యక్రమంలో భాగంగా “రైతన్న మీకోసం” కార్యక్రమం ఆదోని డివిజన్‌లో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు ఆది కృష్ణమ్మ పాల్గొని రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

ఆదోని మండలం దానాపురం గ్రామంలో, టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతమైంది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని అన్నదాతల అభ్యున్నతికి నిరంతరం కృషి జరుగుతుందని రైతు సమస్యల పరిష్కారానికి అంకితభావంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు

రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునే దిశగా పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప,

బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు సిద్ధార్థ నాయుడు, రంగన్న, రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప, సీనియర్ నాయకులు జిందే శంకర్, అయ్యన్న మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దొడ్డనకేరి గ్రామంలో విషాదం టీడీపీ కార్యకర్తకు ఘన నివాళి



ఆదోని, మార్చి 17 (అనంత ప్రభ)

దొడ్డనకేరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నిబద్ధత కలిగిన కార్యకర్త బోయ తలారి వీరేంద్ర బుడ్డలు మేసే పనిలో ఉండగా అకస్మాత్తుగా మరణించడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆయన మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మరియు పార్టీ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకులు మారుతి నాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ మట్టి ఖర్చుల నిమిత్తం ₹10,000 నగదు సహాయం అందజేశారు. అదేవిధంగా ఆదోని మండల టీడీపీ అధ్యక్షులు శివప్ప , ఆదోని టౌన్ ప్రెసిడెంట్ తిమ్మప్ప కలిసి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటూ ₹5,000 రూపాయలను మట్టి ఖర్చుల కోసం అందించారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, “బోయ తలారి వీరేంద్ర సేవలు మరువలేనివి. వారి కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది” అని తెలిపారు. గ్రామస్థులు, పార్టీ నాయకులు కలిసి వీరేంద్ర గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు

## ఉరుకుంద శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానానికి వెండి హారతి పలకల విరాళం



కౌతాళ మండలం, మార్చి 17 (అనంత ప్రభ)

ఉరుకుందలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానానికి ఈరోజు భక్తి భావంతో విశేష విరాళం అందింది. మంత్రాలయం వాస్తవ్యులైన యం. పన్నాగ వెంకటేష్ మరియు వారి కుటుంబ సభ్యులు దేవస్థాన అభివృద్ధి కొరకు 500 గ్రాముల వెండి హారతి పలకలను సమర్పించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమం డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో సీనియర్ అసిస్టెంట్ జి. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విరాళదాతలను దేవస్థానం తరపున సన్మానించి, వారికి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. భక్తుల సహకారంతో దేవస్థానం అభివృద్ధి మరింతగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు

## భూముల కేటాయింపు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వాహించిన జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి, మార్చి 17 (అనంత ప్రభ)

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి మరియు పునరుత్పాదక ఇంధన వనరుల స్థాపన కోసం ఏపీఐఐసీ, నెడ్‌క్యాప్ సంస్థలకు కేటాయించిన భూముల పురోగతిపై జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన గడువులోగా భూముల అప్పగింత ప్రక్రియను పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఉన్న అడ్డంకులను తొలగించి, సరిహద్దుల గుర్తింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏపీఐఐసీ మరియు నెడ్‌క్యాప్ ప్రతినిధులు రెవెన్యూ విభాగంతో సమన్వయం చేసుకుంటూ, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. భూముల వినియోగంపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, పారిశ్రామిక పురోగతికి ఎటువంటి జాప్యం జరగకూడదని జెసి గారు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా తాగునీటి చర్యలు -- అన్ని శాఖల సమన్వయంతో ముందుకు



పుట్టపర్తి, మార్చి 17 (అనంత ప్రభ)

జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎటువంటి తాగునీటి కొరత లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది చలివేంద్రాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని తెలిపారు. అలాగే ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు

## అగ్రికల్చర్ అధికారులతో కలిసి రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు



ఆత్మకూరు, మార్చి 17 (అనంతప్రభ)

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండల కేంద్రం నందు శాసన సభ్యురాలు పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మంగళవారం రోజున రైతన్నా.... మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల తెదేపా నాయకులు వ్యవసాయ అధికారులతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతుల ఇళ్ల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు స్వర్ణ, ఏఈఓ అక్కమ్మ,గ్రామ సిబ్బంది మండల కన్వీనర్ శ్రీనివాసులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏకాంత, లక్ష్మీనారాయణ, నాయకులు సూర్యనారాయణఆచారి, మూడిండ్లఆదెప్ప, మనోహర, బ్రహ్మయ్య, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీశ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈవో



ఆత్మకూరు, మార్చి 17 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం సంధర్భంగా పాలాభిషేకం పంచామృత అభిషేకం, అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, పల్లకి సేవ మరియు రాహు కాలం పూజలో భాగంగా కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు “శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారి అభిషేకం మరియు హోమము నందు పాల్గొన్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి.బాబు, ఆలయ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

## శ్రీ సంగమేశ్వర దేవస్థానం నందు టెంకాయలు పూజా సామాగ్రి విక్రయించు హక్కు వేలం దక్కించుకున్న వై. లక్ష్మీనరసమ్మ




కూడేరు, మార్చి 17 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలో శ్రీ సంగమేశ్వర దేవస్థానం నందు మంగళవారం రోజున ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో దేవాదాయ పర్యవేక్షణ అధికారి శ్రీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన టెంకాయలు మరియు పూజ సామాగ్రి విక్రయించు కొను హక్కుకు గాను జరిగిన బహిరంగ వేలం నందు 6 మంది ఒక్కొక్కరు 10000 చొప్పున డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారు. అనంతపురానికి చెందిన శ్రీమతి వై. లక్ష్మీ నరసమ్మ హెచ్చు పాటదారుగా రూ 2,95,000 /-లకు పాట పాడుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కుసాల నాగరాజు, బాట వెంకటేష్, బొమ్మయ్య, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ జయప్రకాష్ గౌడ్, అంకే సంగప్ప, కుమ్మర వెంకటరాముడు, రాము తదితరులు పాల్గొన్నారు

## రైతన్న సేవలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ -- ఇంటింటికీ చేరిన ప్రభుత్వం పథకాలు



శింగనమల, మార్చి 17 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా శింగనమల మండలం పెద్దమట్ల గొంది గ్రామంలో “రైతన్న సేవలో... మన మంచి ప్రభుత్వం” అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రైతుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. రైతులు ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని అందరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు



AP 4PG 18 - 3- 2026 WEDNESDAYqxp_Layout 1 18-03-2026 12:01 AM Page 3









## కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ పోషకాలు చాలా ముఖ్యం..!



కళ్లు ఆరోగ్యంగా ఉంటేనే మనం ప్రపంచాన్ని చూడగలుగుతాం. అందుకు కళ్లను రక్షించుకోవడానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. కళ్లు ఆరోగ్యంగా ఉండటానికి, విటమిన్ ఏ మాత్రం సరిపోతుందని చాలా మంది అనుకుంటారు. కానీ కళ్లు హెల్తీగా ఉండటానికి మరికొన్ని మిటమిన్లు కూడా అవసరం. ఆ విటమిన్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

విటమిన్ ఏ..

విటమిన్ ఏ కంటిచూపునకు తోడ్పడుతుంది. విటమిన్ ఏ రెటీనాలో వర్ణద్రవ్యాల్ని ఏర్పరచడానికి సహాయపడుతుంది. మొక్కల్లో విటమిన్ ఎ బీటా కెరోటిన్ రూపంలో ఉంటుంది. ఆకుకూరల్ని ఆహారంగా తీసుకున్నప్పుడు బీటా కెరోటిన్ శరీరంలోని పేగుల్లో విటమిన్ %ూ%గా మార-ుతుంది. రోజువారీ తీసుకునే ఆహారంలో విటమిన్ %ూ% 750 మి.గ్రాముల పరిమాణంలా ఉండాలి. బొప్పాయి, క్యారెట్, ఆకుకూరలు, గుడ్లు, చేపనూనె, పాలు, పసుపు పచ్చని ఫలాలు (గుమ్మడి పండు, జామ పండు), వెన్న, టమాటాలో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. ఇవి మీ డైట్‌లో చేర్చుకుంటే.. మీ కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

విటమిన్ ఇ..

విటమిన్ ఇ ఆల్ఫా టోకోఫెరోల్ మాలిక్యులర్ స్ట్రెక్చర్‌లో ఉంటుంది. విటమిన్ ఇ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది, కళ్ల ప్రొటీన్ నిర్మాణాన్ని రక్షించడానికి సహాయపడుతుంది. విటమిన్ ఇ పొందడానికి బాదం, పొద్దుతిరుగుడు, వేరుశనగలు, సోయాబీన్స్ మీ డైట్‌లో ఎక్కువగా తీసుకోండి.

విటమిన్ సీ..

కంటి ఆరోగ్యంలో విటమిన్ సి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. విటమిన్ సీ.. కళ్లను యు వి కిరణాల నుంచి రక్షిస్తుంది. విటమిన్ సి శరీరంలోని ఆక్సీకరణ నష్టాన్ని తగ్గిస్తుంది. ఈ ఆక్సీకరణ ఒత్తిడి కారణంగా.. వయస్సు పెరిగే కొద్దీ, కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మీ కళ్లను రక్షించుకోవడానికి సిట్రస్ కమల, బ్రోకలీ, బ్లాక్ బెర్రీలు, ద్రాక్షపండు, జామపండు, యాపిల్ వంటి పండ్లు తీసుకోండి.

## పాదాలు నల్లగా మారాయా..? ఈ టిప్స్ ఫాలో అయితే తెల్లగా నిగనిగ మెరుస్తాయి..!

అమ్మాయిలు ముఖం, చేతులు, మెడ సౌందర్యం కోసం తీసుకునేంత కేర్ పాదల విషయంలో తీసుకోరు. అందుకే చాలామంది పాదాలు నల్లగా, నిర్జీవంగా మారతాయి. అసలే వేసవికాలం.. ఎండకు డైరెక్ట్‌గా ఎక్స్‌ఫోజ్ అయ్యే భాగాలలో.. పాదాలు కూడా ఒకటి. సమ్మర్‌లో ఇంకా ఎక్కువగా టాన్ పేరుకుపోయి.. నల్లగా మారతాయి. పాదాల టాన్ తొలగి ప్రకాశవంతంగా మెరవాలంటే.. కొన్ని న్యాచురల్ టిప్స్ సహాయపడతాయి.



శనగపిండి, పెరుగు..
పెరుగులో ఉండే లాక్టిక్ యాసిడ్ సున్నితమైన ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది. దీనిలో ట్యాన్‌ను తొలగించే గుణాలు కూడా ఉన్నాయి. శెనగపిండిలోని పోషకాలు చర్మంపై పేరుకున్న డెడ్ సెల్స్, వ్యర్థాలను తొలగిస్తాయి. మీరు టాన్ ప్యాక్ తయారు చేసుకోవడానికి 1 టేబుల్ స్పూన్ శనగపిండి, 3 టేబుల్ స్పూన్ల పెరుగు తీసుకుని పేస్ట్‌లా తయారు చేయండి. మీ పాదాలపై ఈ ప్యాక్ అప్లై చేసి.. 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత మీ చేతితో సున్నితంగా స్క్రబ్ చేసి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేయండి. ఆ తర్వతా మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఇలా వారానికి రెండు సార్లు ఇలా చేస్తే.. కాళ్లపై టాన్ తొలగి ప్రకాశవంతంగా మారతాయి.
బంగాళదుంప, నిమ్మరసం..

బ్లాక్‌హెడ్స్, నల్లటి మచ్చలకు చికిత్స చేయడంలో బంగాళదుంపు ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. బంగాళదుంపలో కాటెకోలేస్ అనే ఎంజైమ్ ఉంటుంది ఇది నల్లమచ్చలను దూరం చేస్తుంది. ఇది నల్లగా మారిన పాదాలకు చక్కని ఛాయను అందిస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి అధికంగా ఉంటుంది.. నిస్తేజంగా, నల్లగా మారిన పాదాల డెడ్ స్కిన్ సెల్స్‌ను తొలగించడానికి న్యాచురల్ అస్ట్రింజెంట్‌గా పనిచేస్తుంది. ఒక బంగాళాదుంప పేస్ట్, 1 నిమ్మకాయ రసాన్ని మిక్స్ చేస్తి పేస్ట్ చేయండి. దీన్ని పాదాలకు అప్లై చేసి.. 20- 30 నిమిషాలు ఆరనిచ్చి, చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా వారం పాటు చేస్తే.. పాదలపై టాన్ తొలగి.. కాంతివంతంగా మారతాయి.

కాఫీ, కొబ్బరి నూనె..
కాఫీ పొడి చర్మానికి మంచి స్క్రబ్‌గా పనిచేస్తుంది. ఇది చర్మంపై పేరుకున్న డెడ్ సెల్స్‌ను తొలగిస్తుంది. కాఫీలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతం చేస్తాయి. కొబ్బరి నూనె చర్మాన్ని తేమనందించి, మెరుపు ఇస్తుంది. రెండు టేబుల్ స్పూన్ల కాఫీ పొడిలో, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి పేస్ట్‌లా చేయండి. ఈ మిక్స్‌ను పాదాలకు అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత చేతివేళ్లతో సున్నితంగా స్క్రబ్ చేయండి. ఆ తర్వాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే పాదాలపై పేరుకున్న టాన్ సులభంగా

చక్కెర, నిమ్మరసం..
నిమ్మరసంలోని సిట్రిక్ యాసిడ్‌కు యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. ఈ గుణాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. చక్కెర ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది. మూడు టేబుల్ స్పూన్ల చక్కెరలో, 1 స్పూన్ నిమ్మరసం వేసి మిక్స్ చేయండి. దీన్ని పాదాలకు అప్లై చేయండి. దీన్ని సుమారు 5 నుంచి 7 నిమిషాల పాటు వృత్తాకారంలో స్క్రబ్ చేయండి. ఆ తర్వాత 10 నిమిషాల పాటు ఆరనిచ్చి.. నీటితో శుభ్రం చేయండి. ఆ తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. కాళ్లు ప్రకాశవంతంగా మెరు-స్తాయి.

## ఈ కూరగాయలు తింటే గ్యాస్ సమస్యలు వస్తాయి..



కడుపు ఉబ్బరం.. ఇది చాలా మందిని వేధించే సమస్య. ఆహారం తిన్న తర్వాత ఈ సమస్య వస్తుంటుంది. ఇది చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎంతలా అంటే ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. ఛాతీపై బరువుగా ఉంటుంది. ముఖ్యంగా కొన్ని ఫుడ్స్ తీసుకున్న తర్వాత కడుపులో గ్యాస్ ఫామ్ అవుతుంది. అవేంటో తెలుసుకోవాలి. ఈ సమస్యని పోగొట్టేందుకు మెడిసిన్ అవసరం.

న్యూట్రిషనిస్టుల ప్రకారం..
న్యూట్రిషనిస్ట్ లవనీత్ బాత్రా ప్రకారం, ఉల్లిపాయ, వెల్లుల్లి, క్యాబేజీ తింటే వెంటనే గ్యాస్ వస్తుంది. జీర్ణశక్తి బలహీనంగా ఉన్నవారికి ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. గ్యాస్ సమస్య నుండి బయటపడేందుకు ఓ రెసిపీ ఉంది. కానీ, ఏయే ఫుడ్స్ గ్యాస్‌ని ఉత్పత్తి చేస్తాయని తెలుసుకోవడం చాలా ముఖ్యం.

న్యూట్రిషనిస్టుల చెబుతున్నదేంటంటే..
ఉల్లిపాయ వెల్లుల్లి

ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఎక్కువ మొత్తంలో ఫ్రక్టాన్లు ఉంటాయి. ఈ మూలకాల్లో కరిగే ఫైబర్స్ ఉంటాయి. ఇవి కడుపులో తీవ్రమైన వాయువుని సృష్టిస్తాయి.

బ్రకోలీ..
క్యాబేజి, బ్రోకలీ, కాలే వంటి కూరగాయల్లో రాఫినోస్ ఉంటుంది. దీనిని బాడీ తేలిగ్గా జీర్ణించుకోలేదు. ఈ కారణంగా ఉబ్బరం ఏర్పడుతుంది. కాబట్టి, వీటిని తినేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలి.
బీన్స్..

పప్పుధాన్యాలు ఆరోగ్యానికి మంచిది. అయితే, బీన్స్‌లో హై ఫైబర్, ఒలిగోశాకరైడ్స్ ఉంటాయి. కాబట్టి, వీటిని తిన్నప్పుడు ఉబ్బరంగా ఉంటుంది. ఇందులో బాడీలో విచ్ఛిన్నం కానీ చక్కెర పదార్థాలు ఉంటాయి.

పచ్చికూరగాయలు..
చాలా మంది పచ్చి కూరగాయలతో సలాడ్ చేసుకుని తింటారు. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అందుకే వీటిని తిన్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏం తినాలి. ఏవి తినకూడదో తెలుసుకోవాలి.
కూల్ డ్రింక్స్
నిజానికి చాలా మంది కడుపు ఉబ్బరంగా ఉన్నప్పుడు కూల్ డ్రింక్స్ తాగుతారు. దీని వల్ల గ్యాస్ తగ్గిపోతుందని అనుకుంటారు. కానీ, ఇందులో కార్బన్ డై ఆక్సైడ్ ఉంటుంది. ఇది కడుపులోకి ప్రవేశించినప్పుడు గ్యాస్ట్రిక్ నొప్పికి కారణమవుతుంది. రెగ్యులర్‌గా తీసుకుంటే ఉబ్బరం, త్రేన్పుల సమస్యలు ఎక్కువగా ఉంటాయి.

ఆయుర్వేద ట్రీట్‌మెంట్..
ఆహారం తీసుకున్నాక 30 నిమిషాల తర్వాత సెలెరీ, సోంపు, జీలకర్ర కషాయాలు తీసుకుండి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ధనియాల కషాయం తీసుకోవడం మంచిది.
ఉప్పుని తగ్గించండి.
నెమ్మదిగా, బాగా నమిలి తినండి
పుష్కలంగా నీరు తాగాలి.

## ఈ 5 పాటిస్తే బరువు తగ్గడం ఖాయం..

బరువు తగ్గాలనకుకోవడం ఈజీనే. కానీ, బరువ పెరగకుండా ఫుడ్ క్రేవింగ్స్‌ని కంట్రోల్ చేసుకోవడం కష్టం. దీనికోసం కొన్ని పాటించాలి. అవేంటి.. వాటిని వాడడం వల్ల కలిగే లాబాలు ఏంటి.. దీంతో బరువు తగ్గుతారా తెలుసుకోండి.

### బెస్ట్ ప్లాన్..

బరువు తగ్గడానికి ముందుగా ఏం తినాలి.. ఏం తినకూడదు. ఏ వర్కౌట్స్ చేయాలి. ఎలా చేయాలి. అనేది ఆలోచించాలి. ఆ విధంగానే బరువు తగ్గాలి. వీటిలో మీరు ఎంత బరువు తగ్గాలనుకుంటున్నారనేది నిర్ణయించుకోవాలి. ఆ విధంగానే దానికి కట్టుబడి ఉండాలి.

### హెల్దీ డైట్..

అదే విధంగా, మంచి హెల్దీ ఫుడ్ తీసుకోవాలి. కార్బోహైడ్రేట్స్ బదులు హెల్దీ ఫుడ్స్ తీసుకోవాలి. తృణధాన్యాలు తీసుకోవాలి. చికెన్ చేపలు, బీన్స్, శనగల వంటివి తీసుకోవాలి. దీని వల్ల త్వరగా బరువు తగ్గుతారు.

### ఇష్టమైన వర్కౌట్..

మీరు వర్కౌట్ కూడా ఎంచుకోవచ్చు. ఇవన్నీ ఎనర్జిటిక్‌గా ఉండాలి. మీకు వీలున్న టైమ్‌లో నచ్చిన ఎక్సర్‌సైజ్ చేయొచ్చు. అందులో డ్యాన్స్‌లు కూడా ఉండొచ్చు. ఏవైన సరే మీకిష్టమైన వర్కౌట్స్ చేయొచ్చు. ఇందులో మీరు ప్రయోగాలు కూడా చేయొచ్చు.

### మంచి పార్టనర్..

మీరు బరువు తగ్గాలనుకున్నప్పుడు మీ చుట్టూ ఉన్న పరిస్థితులు వాటికి బ్రేక్ చేస్తాయి. అందులో ఫ్రెండ్స్‌తో బయటికి వెళ్ళడం లాంటివి కూడా ఉన్నాయి. అలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే.. మీరు మీలానే బరువు తగ్గాలనుకునేవారితో ఉంటే బరువు తగ్గడం ఈజీ అవుతుంది.

### మంచి నిద్ర

హెల్దీగా బరువు తగ్గడానికి మంచి మార్గాలు కూడా ఉన్నాయి. ఇందుకోసం ఒత్తిడిని దూరం చేసి కంటి నిండా నిద్ర ఉండేలా చూసుకోండి. దీని వల్ల త్వరగా బరువు తగ్గుతారు.

గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.





AP 4PG 18 - 3- 2026 WEDNESDAYqxp_Layout 1 18-03-2026 12:01 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవిందే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిసున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com